ప్రజాశక్తి

శనివారం 1 ఫిబ్రవరి 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

విభజన హామీలు అమలు చేయాలి

- విశాఖ స్టీల్ ఉక్కును పరిరక్షించాలి...
- పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి..
- సిపిఎం డిమాండ్
- మహాసభ జాతాలకు ఘన స్వాగతం..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కేంద్ర ప్రభుత్వ విభజన హామీలను అమలు చేయాలని, విశాఖ స్టీల్ ఉక్కును పరిరక్షించాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సిపిఎం రాష్ట్ర 27వ మహాసభల ప్రచార జాతాలు గురువారం ఒంగోలుకు చేరాయి. ఆ జాతాలకు ఆ పార్టీ ప్రకాశం జిల్లా కమిటీ నగర కమిటీలు ఘనంగా స్వాగతం పలికాయి. తొలుత విశాఖ ఉక్కు పరిరక్షణ జాతాకు పాత గుంటూరు రోడ్డు ఏ1 కన్వెన్షన్ హాల్ వద్ద పార్టీ జిల్లా కమిటీ నగర కమిటీ ఘన స్వాగతం పలికింది. నెల్లూరు బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన సభలో రామస్వామి మాట్లాడారు. 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మే నిర్ణయం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు స్థాపనకు తొలుత మెడికల్ విద్యార్థులు పోరాటం చేసిన ఘటనను గుర్తు చేశారు. పుచ్చలపల్లి సుందరయ్య నాయకత్వంలో 50 మంది కమ్యూనిస్టు శాసనసభ్యులు, ఆరుగురు పార్లమెంటు సభ్యులు, రాజీనామా చేసి 32 మంది ప్రాణ త్యాగాలు ఫలితమే విశాఖ ఉక్కు సాధనగా ఆయన గుర్తు చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం దాటవేత ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు ▶ 2లో



ఒంగోలు చేరుకున్న పోలవరం ప్రాజెక్టు పరిరక్షణ జాతా, అమరావతి రాజధాని అభివృద్ధి జాతా నాయకులు



ఒంగోలులో జాతా వచ్చిన సందర్భంగా సిపిఎం నాయకుల బైక్ ర్యాలీ



బాపట్లకు చేరుకున్న జాతా నాయకులు

ప్రజలకు ఉపయోగపడేలా రాజధాని నిర్మించాలి 4లో

హాస్టళ్ల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి
- ఆనంద నిలయం సందర్శన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సంక్షేమ హాస్టళ్ళ అభివద్ధి, విద్యార్థులకు మెరుగైన బోధన, వారి ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో కలిసి శుక్రవారం ఒంగోలులో అంబేద్కర్ భవన్ సమీపంలోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ (ఆనంద నిలయం)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ హాస్టల్లో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్లో ఉంటున్న విద్యార్థులు కూడా మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ హాస్టళ్ళలో మరమ్మతులకు ఈ ఏడాది రూ.143 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఈ హాస్టల్లో రూ.9.30 లక్షలకు పైగా విలువైన మరమ్మతు పనులు చేస్తున్నామని, మరో రూ.30 లక్షలతో హాస్టల్ పైన రెండు గదులను కూడా నిర్మిస్తున్నామన్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి ప్రత్యేక అవసరాలను మంత్రి తెలుసుకున్నారు. ఆ మేరకు కూడా వసతులు కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన బడ్జెట్ కూడా ఇస్తామని చెప్పారు. విద్యార్థుల ఆసక్తి మేరకు మెనూలో మార్పులు చేసి, వారికి భోజనం పెట్టాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 21 మంది ఉన్నారని అధికారులు తెలుపగా, అందరూ కూడా మంచిగా చదువుకొని మొదటి ప్రయత్నంలోనే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని మంత్రి సూచిం చారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా విద్యార్థులకు నైట్ డ్రెస్సులు, టవల్స్ ఇస్తామని మంత్రి ప్రకటించారు.



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

వల్లూరమ్మ గుడికి రూ.1.50 కోట్లు

ఒంగోలు శివారులోని వల్లూరమ్మ గుడి అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని మంత్రి తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డికి ఈ సందర్భంగా మంత్రి కతజ్ఞతలు తెలిపారు. మంత్రి, కలెక్టర్ వెంట జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎన్.లక్ష్మా నాయక్, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన, ఏపిఈడబ్ల్యుఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ బాబు, ఇతర అధికారులు ఉన్నారు.

వైసిపి ధర్నాలకు పిలునివ్వటం సిగ్గుచేటు

ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై ఈ నెల 5న వైసీపీ ధర్నాకు పిలుపునివ్వడం సిగ్గుచేటని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఎద్దేవా చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ రూ.2800 కోట్ల బకాయిలు పెట్టింది మీరు కాదా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో గాడి తప్పిన రాష్ట్రాన్ని చంద్రబాబు నాయుడు తన విజన్‌తో చక్కదిద్దుతున్నారన్నారు.

పింఛన్ నగదును

ప్రతి లబ్ధిదారుడికీ అందజేయాలి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదును ప్రతి లబ్ధిదారుడికి అందజేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమం శనివారం జిల్లావ్యాప్తంగా కొనసాగు తుందన్నారు. పెన్షన్లు పంపిణీ చేసే సిబ్బంది ఎటువంటి అవినీతి, ఆరోపణలకు పాల్పడకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. పెన్షన్లను లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయాలన్నారు. ఒకటో తేదీన ఐవిఆర్ఎస్ ద్వారా పెన్షన్‌దారులకు ఫోన్ చేయడం జరుగుతుందన్నారు. ఐవిఆర్‌యస్ ఫోన్ కాల్స్‌లో సిబ్బంది అవినీతికి పాల్పడ్డారని, సిబ్బంది ప్రవర్తన సరిగా లేదని, ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేయలేదనే సమాధానాలు రాకుండా సిబ్బంది జాగ్రత్త పడాలన్నారు. నియమితులైన మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు పింఛన్ సవ్యంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగదు పంపిణీ జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు మొక్క అందజేస్తున్న ఎస్పీ దామోదర్

డీజీపీని కలిసిన ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్‌కుమార్ గుప్తాని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క అందజేసి.. శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు

భద్రతా నియమాలు పాటించాలి

డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-టంగుటూరు

36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్ (టోల్‌గేట్) దగ్గర శుక్రవారం డీఎస్పీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నీ సందర్భంగా డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనదారులు భద్రతా నియమాలు పాటించాలన్నారు. అనంతరం వాహనదారులతో బైక్ ర్యారీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శింగరాయకొండ సిఐ చావా హజరత్తయ్య, టంగుటూరు ఎస్ఐ వి.నాగమల్లీశ్వరరావు, సింహపురి ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టు అధికారి శివకుమార్, టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.



జరుగుమల్లిలో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి సునీల్ కుమార్

క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి-కొండపి

క్రిమి సంహారక మందులు వాడకాన్ని వీలైనంతగా తగ్గించుకొని సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వేలం నిర్వహణాదికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. పొగాకు క్యూరింగ్ మరియు గ్రేడింగుపై రైతులకు శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం కొండపి మండలంలోని గోగినేనివారిపాలెంలో జరిగింది. ఈ సందర్భంగా జి.సునీల్ కుమార్ మాట్లాడుతూ పొగాకు రైతులు ఆకు రేలుచుట, క్యూరింగ్, గ్రేడింగ్ తదితర విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక విస్తీర్ణంలో నాటడం, అధికంగా పండించడం చేయరాదన్నారు. పొగాకుతోపాటు వివిధ రకాల ప్రత్యామ్నాయ పంటలైన కంది, మిరప, శనగ పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో తులసి, ఆర్‌యం కార్యాలయం అధికారి జి.వెంకటరావు, కంపెనీల ప్రతినిధులు మోతిలాల్ కొండలు, సాగర్‌బాబు పాల్గొన్నారు.

టంగుటూరు : టంగుటూరు పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలోని గ్రామాలైన వావిలేటిపాడు, జరుగుమల్లి, చింతలపాలెం, దావడూరు, చిరుకురుపాడు, కమ్మావారి పాలెం గ్రామాల్లో వేలం నిర్వహణాధికారి సునీల్ కుమార్ పర్యటించారు. పొగాకు తోటలు, క్యూరింగ్‌ను పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ జె.తులసి, క్షేత్రాధికారి జి.ఉపేంద్ర, జి.వెంకట్రావు, ఐ.వికాస్, ఎస్.సాయి శ్యామల, రైతులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల అభివృద్ధికి

రూ.10 వేల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకలు పెంపకం దారులకు బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని ఆ సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం ప్రకాశం జిల్లా కమిటీ సమావేశం ఒంగోలులోని ఎల్బీజీ భవన్ ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, రాష్ట్ర కార్యదర్శి కిలారీ పెద్దబ్బాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో గొర్రెలు, మేకల పెంపకందారులకు రూ.10 వేల కోట్లు కేటాయించి ప్రతి పెంపకందారునికి 50 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల చోప్పున రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించకూండా చిన్న చూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పెంపకం దారుల సమస్యలు పరిష్కారం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో మేలురకం మాసం ఉత్పత్తిని పెంచాలంటే లక్ష మంది పెంపకం దారులకు మేలు రకం విత్తన పోట్టేళ్ళు రూ.10 వేల విలువైనవి పంపిణీ చేయాలని కోరారు. గొర్రెలు, మేకల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్.సి.డి.సి రూ.88 కోట్ల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖాతాకు విడుదల చేసి సంవత్సరాల కావస్తున్నా వాటిని విడుదల చేయకుండా గత ప్రభుత్వం దారి మళ్ళించిందని ఆరోపించారు. ఆ నిధులను వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కండే బాల కృష్ణ, నక్క గంగరాజు, మసనం శివయ్య, కొండరాజు జయరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుపతిరావు

పశు ఆరోగ్య వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండల కేంద్రంలో శుక్రవారం పశు ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి టి.అనూష మాట్లాడుతూ పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 48 గేదెలకు, 60 దూడలకు, 200 గొర్రెలకు నట్టల నివారణ మందులు తాగించారు. 14 గేదెలకు చూడి పరీక్షలు, 12 గేదెలకు గర్భకోశ పరీక్షలు, ఐదు గేదెలకు గర్భాదారణ ఇంజక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరు పశువైద్యాధికారి వి.శోభ, సర్పంచ్ శ్రావణి, ఎంపీటీసీ వెంకట్రావు, సింగరి శ్రీను పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా గత ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆరోజు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి తీర్మానాన్ని బలపరచి నేడు అధికారంలోకి ఉక్కు పరిశ్రమను నిర్లక్ష్యం చేస్తుందని దుయ్యబట్టారు. ఉక్కు పరిశ్రమకు గనులు కేటాయించకుండా జిందాల్ పరిశ్రమకు గనులు కట్టబెట్టే యత్నాలు చేయడం ఆక్షేపనీయమన్నారు. కేవలం 4,890 కోట్ల ప్రభుత్వ పెట్టుబడులతో 60 వేల కోట్లు డివిడెంట్‌గా ప్రభుత్వానికి అందించిన ఘనత విశాఖ ఉక్కుకు దక్కిందన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి గనులు లేకనే విశాఖ ఉక్కు అప్పులపాలయినట్లు ప్రకటించారని, ఇకనైనా కేంద్రం స్పందించి గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నం ఉపసంహరించుకోవాలని, తక్షణం విశాఖ ఉక్కుకు ఘనులు కేటాయించి, సైల్‌లో విలీనం చేయాలని వారు డిమాండ్ చేశారు.

సాయంత్రం సాగర హోటల్ వద్ద జరిగిన సభలో పోలవరం ప్రాజెక్ట్ జాతా నాయకులు లోకా రామారావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు సమస్యను రాష్ట్ర ప్రజలకు సాగునీరు, విద్యుత్ అందించే సమస్యగా గుర్తించాలన్నారు. పోలవరంను 'జాతీయ ప్రాజెక్టుగా గుర్తించామని, దేశానికి అంకితం చేస్తున్నామని ప్రకటించిన బిజెపి ఈ అంశాన్ని మరిచిందని ఆయన విమర్శించారు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మొదలు జగన్మోహన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు ఆదివాసీల పక్షాన ఉన్నామని ముసలి కన్నీళ్లు కారుస్తున్నారు తప్ప, నిర్వాసితులైన ఆదివాసుల గురించి ఒకరైనా ఆలోచించే పరిస్థితి లేదన్నారు. అధికార పక్షంతో పాటు ప్రతిపక్షాలు సైతం నిర్వాసితుల కోసం ఉద్యమం చేస్తామని ప్రకటిస్తున్నారని, ఎవరిపై ఉద్యమం చేస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద 'ఇంటికి ఇల్లు భూమికి భూమి ఇవ్వాలని కోరారు. ఏటా వరదలు వస్తే 60 గ్రామాలు ముంపుకు గురవుతున్నాయని, లక్షలాదిగా ఆదివాసీలు ఇక్కట్లు పడుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం



నెల్లూరు బస్టాండు వద్ద మాట్లాడుతున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ జాతా నాయకులు రామస్వామి

కేంద్రంపై ఒత్తిడి తేవాలని, నిర్వాసితులకు వెంటనే ప్యాకేజీ ప్రకటించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాజధాని నిర్మాణం రాష్ట్ర అభివృద్ధి జాతా నాయకులు వై.నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలు అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి అభివద్ధి పరచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచినప్పటికీ ప్రత్యేక హెూదా, ప్రత్యేక ప్యాకేజీ, రాజధాని నిర్మాణం వంటి పనులు చేపట్టిన దాఖలాలు లేవని విమర్శించారు. ఏటా పదివేల కోట్లు ప్యాకేజీ ప్రకటిస్తామని ప్రకటించిన కేంద్రం కేవలం రూ.1500 కోట్లే ఇచ్చి మభ్యపెట్టిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కు సాధన కోసం ఆనాడు పార్లమెంట్ సభ్యులు మాదాల నారాయణస్వామి, శాసనసభ్యులు సూదనగుంట సింగయ్య, తవనం చెంచయ్య రాజీనామాలు చేసిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమములో జాతా నాయకులు మహేష్, జి.శ్రీనివాసులు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి తదితరులు మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిరక్షణ జాతా పాత గుంటూరు రోడ్డు, నవభారత్ థియేటర్, అద్దంకి బస్టాండ్, మస్తాన్ దర్గా సెంటర్, ప్రకాశం భవనం మీదుగా నెల్లూరు బస్టాండ్ వరకు రోడ్ షో నిర్వహించగా.. దక్షిణ బైపాస్ సంఘమిత్ర ఆసుపత్రి వద్ద వీడ్కోలు పలికారు. పోలవరం ప్రాజెక్టు పరిరక్షణ జాతా, అమరావతి రాజధాని అభివద్ధి జాతాకు మంగమ్మ కళాశాల నుంచి పాత జాతీయ రహదారి మీదుగా మంగమూరు రోడ్డు, సాయిబాబా గుడి, రంగారాయుడు చెరువు, అంజయ్య రోడ్డు, లంబాడీ డొంక, కర్నూల్ రోడ్డు మీదుగా సాగర్ హెూటల్ సెంటర్‌కు చేరింది. జాతాకు సాగర్ హోటల్ వద్ద సభ అనంతరం సంఘమిత్ర ఆసుపత్రి వద్ద వీడ్కోలు పలికారు. జాతాల సభలకు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు కంకణాల రమాదేవి, పి కల్పన, వి.బాలకోటయ్య, జి.రమేష్, బి.రఘురాం, జాతాల ప్రతినిధులు దడాల సుబ్బారావు, సేలం రమేష్, పులి సంతోష్, పి నాగమణి, ఎం వలీ, బి వెంకటేశ్వర్లు, పి రామ్మోహన్, గుర్రప్ప, సీనియర్ నాయకులు జాలా అంజయ్య, కే పెద్దబ్బాయి, తోట తిరుపతిరావు, తంబి శ్రీను, అబ్బా ఆదిలక్ష్మి, వి మోజెస్, ఎస్ డి హుస్సేన్, కొర్నపాటి శ్రీనివాసరావు, టి మహేష్, సిహెచ్ మహేష్, కె ఎఫ్ బాబు,బి.వి రావు, వై అంజమ్మ, ఆదిలక్ష్మి, మారేళ్ల సుబ్బారావు, భక్తసింగ్ రాజు, ఏ లక్ష్మీనారాయణ సభ్యులు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం వద్ద జనరల్ మేనేజర్ ఎంఎల్‌వి.ప్రసాదరావు, సిబ్బంది పోలవరం జాతాకు ఘన స్వాగతం పలికారు.

కూటమి పాలనలో ప్రభుత్వ విద్య నిర్వీర్యం

5న ఫీజుపోరును జయప్రదం చేయాలి

మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-మద్దిపాడు

కూటమి ప్రభుత్వం కార్పొరేట్ విద్యకు అందలం ఎక్కించి, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తోందని మాజీ మంత్రి, నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. మండల పరిధిలోని ఘడియపూడి గ్రామంలోని వైసీపీ కార్యాలయంలో ఫీజుపోరు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలనే ఆలోచన లేదన్నారు. ఎన్నికలలో సూపర్ సిక్స్ పథకాలు అని చెప్పి, సంపద సృష్టిస్తానని ప్రచారం చేసి వాటిపై కనీసం నోరు కూడా మెదపడం లేదన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతుల కోసం దీక్ష చేశామని, పెరిగిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ధర్నాలు చేశామని, ఇప్పుడు విద్యార్థుల కోసం చంద్రబాబు సర్కారుపై మరో నిరసన గళాన్ని విప్పేందుకు సిద్ధమైనట్లు చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.3,900 కోట్లు తక్షణమే విడుదల చేయాలన్నారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాయని తెలిపారు. పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు చదువు మధ్యలో ఆపేసి పనులకు వెళ్లే దుస్థితి వచ్చిందని, ప్రభుత్వం తక్షణమే తన వైఖరి మార్చుకొని విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పక్షాన అండగా నిలుస్తూ చంద్రబాబు సర్కార్‌పై నిరసనగలం తెలియజేసేందుకు వైసిపి ఫీజుపోరు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఫిబ్రవరి 5వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా నియోజక వర్గంలోని నాయకులకు కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటానని, అందులో భాగంగానే ఘడియపూడి గ్రామంలో వైసిపి కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వాకా కోటిరెడ్డి, బెజవాడ రాము, నారా సుబ్బారెడ్డి, బొమ్మల ఆంజనేయులు, మండవ చంద్ర మురళి, అన్వేష్, జి.రవి, దేవదాసు, రజిని, సంధ్య, మస్తానమ్మ, జయమ్మ, సురేష్, మహేష్, ప్రభాకర్, సోషల్ మీడియా యాక్టివిస్ట్ డేవిడ్, పండు పాల్గొన్నారు.



ఫీజుపోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

విశ్రాంత పీడీ కోటేశ్వరరావు మృతి

నివాళులర్పించిన నాయకులు



కోటేశ్వరరావు (ఫైల్)

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండకు చెందిన విశ్రాంత పీడీ బండి కోటేశ్వరరావు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. బండి కోటేశ్వరరావు ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తూ ఆ తర్వాత పీడీగా శింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రిటైర్మెంట్ అయ్యారు. మూలగుంటపాడులో నివసిస్తున్నారు. ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఉలవపాడు సమితి యుటిఎఫ్ అధ్యక్షుడిగా పనిచేశారు. దాచురి రామిరెడ్డి శాసనమండలి సభ్యులుగా ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారు. బండి కోటేశ్వరరావు మృతి చెందడంతో జేవీవీ నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.హరిబాబు, సర్పంచ్ డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాసరావు, ఎస్.రవి, చిన్న స్వామి, కె.లక్ష్మీనారాయణ, జె.కేశవరాజు, కొల్లూరు వెంకయ్య, సుధాకర్ రెడ్డి, శ్రీధర్, ఆనంద్ కుమార్, చెంచు రామారావు, బాలకోటయ్యలు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన కుమారుడు బండి లక్ష్మీ నారాయణను ఓదార్చారు.

ఏపీ టూరిజం చైర్మన్ డాక్టర్ నుకసాని బాలాజీ, లీగల్ సెల్ పార్లమెంటు అధ్యక్షులు సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, కూనపురెడ్డి వెంకట సుబ్బారావు, వికృతి తిరుపతి రావు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, వైసీపీ నాయకుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాపూరి ప్రభావతి, యనమల మాధవి, చుక్కా కిరణ్ కుమార్, షేక్ నౌషాద్, అల్లావుద్దీన్‌లు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేశవరపు జాలిరెడ్డి, ఎస్టియు నాయకులు నూకసాని వెంకటేశ్వర్లు, పిడిఎఫ్ శాసనమండలి సభ్యులు ఐ.వెంకటేశ్వర్లు, మాజీ శాసన మండలి సభ్యులు విట్టపు బాలసుబ్రమణ్యంలను బండి కోటేశ్వరరావు కుమారుడు బండి లక్ష్మీ నారాయణను ఫోన్లో పరామర్శించారు. టీడీపీ, వైసీపీ, జనసేన నాయకులతో పాటు సింగరాయకొండ, కందుకూరు, టంగుటూరు, ఒంగోలు ప్రాంతంలోని ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున వచ్చి బండి కోటేశ్వరరావుకు నివాళులు అర్పించారు.



కోటేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఎన్టీఆర్ శత వర్ధంతిని పురస్కరించుకొని పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. శుక్రవారం నాడు స్థానిక ఏకేవీకే కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి పట్టణంలోని పలు పాఠశాలకు చెందిన 400 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు మాట్లాడుతూ ప్రతి ఏటా విద్యార్థులకు విద్యావిషయక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కళాపరిషత్ నిర్వాహకులు పిహెచ్‌డి కృష్ణరాజు, ఈపూరు శివప్రసాద్, ఆత్మకూరు బ్రహ్మయ్య టాలెంట్ టెస్ట్‌ను పర్యవేక్షించగా, ఏకేవీకే కళాశాల కార్యదర్శి పల్లపు చెంచురామయ్య, ప్రిన్సిపాల్ వెంకట రెడ్డి, ఏకేవీకే డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లెల్లముడి కోటేశ్వరరావు, అనిల్ జల్ది, ఉషా కళ్యాణి, హరి, శ్రీలక్ష్మి, దివ్య, రవీంద్ర, జె.కోటేశ్వరరావు సుబ్బారావు, చింపారావు, మణికంఠ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

గ్రామీణ ప్రాంతాల్లో పాడిపరిశ్రమను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పశుసంవర్ధక శాఖ ఒంగోలు డివిజన్ ఉపసంచాలకులు ఏ.రమేష్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశుఆరోగ్య శిబిరాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ సంద ర్భంగా ఈదుమూడిలో శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 45 గేదెలకు సాధారణ పరీక్షలు, 13 గేదెలకు గర్భకోశ వ్యాధులకు, 6 గేదెలకు చూడి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గొర్రెలకు నట్టల నివారణ మందు తాగించారు. ఈ కార్యక్రమంలో ఏడి ఎస్.నాగభూషణం, డాక్టర్లు కె.అనురాధ, జాస్మిన్, పాడిరైతులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-చీమకుర్తి

లయన్స్ గవర్నర్ పి.గోపీచంద్ అధికార పర్యటన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక జవహర్ నర్సింగ్ హోమ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.జవహర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఒక పేద మహిళలకు జీవనోపాధి కోసం కుట్టు మిషన్ అందజేశారు. ఇద్దరూ బధిరులకు వినికిడి పరికరాలు అందజేశారు. బాలికల గురుకుల పాఠశాలకు మిక్సర్ కం గ్రైండర్లు అందజేశారు. ఎన్నెస్పీ కాలనీ పాఠశాలకు గ్యాస్ పొయ్యి, వంట సామాగ్రి అందజేశారు. రంగస్థలం నటుడు చీమకుర్తి నాగేశ్వరరావు సతీమణికి పెన్షన్ అందజేశారు. ఎస్‌కేఆర్ బదిరుల పాఠశాల, రాంనగర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిరిజన గురుకుల పాఠశాల, గుడిపూడివారిపాలెం ప్రాథమిక పాఠశాలలలో స్పెషల్ టీచర్ గ్రాంట్, పి.నాయుడుపాలెం హైస్కూల్లో స్పెషల్ టీచర్‌కు గ్రాంట్‌ను అందజేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లో పనిచేసే స్వీపర్‌కు గ్రాంట్ అందజేశారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లను ప్రారంభించారు. స్థానిక ఎన్నెస్పీ పాఠశాలలో కళావేదికను ప్రారంభించారు. క్యాన్సర్ బాధితురాలికి నెల వేతనం రూ.3 వేలు అందజేశారు. రామతీర్థం గోశాలకు రూ.10 వేలు, నల్గొండ మహాత్మా గాంధీ టెంపుల్‌కు ఆర్థిక సహాయం అందజేశారు. 50 మందికి దుస్తులు మరియు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నూనె హేమ సుందర్రావు, ఎస్.అంజిరెడ్డి, కోశాధికారి చలువాది పార్థసారధి, లయన్స్ డైరెక్టర్ చలువాది రమేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే అబ్దుల్ హై, డి.వీ రాంజనేయులు, లయన్స్ వైస్ గవర్నర్ ఆర్.లక్ష్మీ నారాయణ, మాజీ గవర్నర్ విజయకుమార్ రెడ్డి, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ చలువాది బదరీ నారాయణ, నూనె వంశీకృష్ణ, నూనె అనుదీప్, ప్రధాన ఉపాధ్యాయులు జె.యాకోబు, నల్లూరి వెంకటేశ్వరరావు, ఏ.వీరారెడ్డి, చలువాది శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ చల్ల అంకులు, ఆలపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న దృశ్యం

అవినీతి కేసులో నిందితురాలు అరెస్టు

ప్రజాశక్తి-రేపల్లె

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో జరిగిన అవినీతిపై నమోదైన కేసులో మరో మహిళను అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ మల్లికార్జున రావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 21 వార్డుకు చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు కొమ్మాల సువార్తకుమారిని అరెస్టు చేశామన్నారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ పి.వెంకట నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. కోర్టు నిందితురాలికి 15 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ కేసులో పలువురిని అరెస్టు చేయాల్సి ఉందని, త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. బాధితులకు చట్టపరంగా న్యాయం చేస్తామని తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న అడవి పంది

గాయాలతో బయటపడ్డ యువకుడు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ద్విచక్రవాహనాన్ని అడవి పంది ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని జమ్మనపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. పెద్దరవీడు మండలం గుండంచర్లకు చెందిన కొండేటి వెంకటేశ్వర్లు మార్కాపురం పట్టణంలో పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా జమ్మనపల్లి వద్ద రోడ్డుపై అడవి పంది ఒక్కసారిగా అడ్డుగా వచ్చి కొండేటి వెంకటేశ్వర్లు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో కింద పడిపోయిన వెంకటేశ్వర్లుపై అడవి పంది దాడి చేసి గాయపరిచింది. ప్రమాదాన్ని గమనించిన అటువైపుగా వెళుతున్న స్థానికులు హుటాహుటిన క్షతగాత్రుడైన వెంకటేశ్వర్లును మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.

పొగాకు బ్యారన్లు దగ్ధం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని ఎం.వేములపాడు పంచాయతీ పరిధిలోని గొర్లమిట్ట గ్రామంలో శుక్రవారం రెండు బ్యారన్లలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో మద్దినేని సుబ్బారావు, మద్దినేని లక్ష్మీనారాయణ అనే రైతులకు చెందిన పొగాకు బ్యారన్లు దగ్ధం కావడంతో సుమారు పది లక్షల రూపాయలకు పైగా ఆస్తి నష్టం జరిగింది. ఈ ప్రమాదంలో పొగాకు కర్రలు, టైర్లు, పూర్తిగా కాలిపోయి బ్యారన్లు దెబ్బతిన్నాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్

ఘనంగా మడియాలమ్మ జాతర

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక రామనగర్‌లో రజకుల కులదైవం మడియాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. టీడీపీ, వైసీపీల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రభలపై సినీ పాట కచేరీలు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి ప్రభపై ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తామన్నారు. రజకుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాట్రగడ్డ రమణయ్య, గొల్లపూడి సుబ్బారావు, కందిమల్ల గంగాధర్ రావు, గొల్లపూడి కోటేశ్వరరావు, రావిపాటి రాంబాబు, సూరంపల్లి హనుమంతరావు, జి.చెన్నయ్య పాల్గొన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభపై దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రజకుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పొదిలి బాలకాశయ్య, కౌన్సిలర్లు పొదిలి వెంకాయమ్మ, సోమ శేషాద్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ప్రజలకు ఉపయోగపడేలా ...

రాజధానిని నిర్మించాలి

ప్రచార జాతా బృందాలకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే విధంగా రాజధానిని నిర్మించాలని సిపిఎం రాష్ట్ర నాయకులు వై.నేతాజీ డిమాండ్ చేశారు. నెల్లూరు ఈనెల 1,2,3 తేదీల్లో నిర్వహిస్తున్న సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం కోరుతూ రాజధాని ప్రాంతం నుంచి ప్రారంభమైన ప్రచార జాత శుక్రవారం బాపట్లకు చేరింది. తొలుత ప్రచార జాతా బృందానికి సిపిఎం పట్టణ, జిల్లా కమిటీ నాయకులు పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కొత్త బస్టాండు చీలు రోడ్డు వద్ద ఉన్న కామ్రేడ్ చివుకుల శేషశాస్త్రి స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన సభకు సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు టి. కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు.సభలో నేతాజీ మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రజలకు ప్రయోజనకరమైనదిగా ఉండాలన్నారు. అప్పుల రాజధాని కారదన్నారు. అమరావతి రాజధాని ,రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాజధానిని కేంద్ర ప్రభుత్వమే నిర్మించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాపట్ల జిల్లా అభివృద్ధికి గత ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. రెండు పార్టీలు ఒకే విధానాన్ని అవలంబిస్తుందని విమర్శించారు. ప్రచార జాతకు ముందు ప్రజానాట్య మండలి కళాకారులు విప్లవ గేయాలు ఆలపించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, బాపట్ల జిల్లా నాయకులు పి.కొండయ్య, కె శరత్,ఎన్.కోటేశ్వరావు , కె.నాగేశ్వరావు, బుచ్చిరాజు ,వై. శ్రీనివాస్ బొనిగల సుబ్బారావు, దేవరకొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకుడు నేతాజీ

చీరాల : అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రాంటు మంజూరు చేసి, విభజన హామీలు, ప్రత్యేక హోదా అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర నాయకులు నేతాజీ కోరారు. సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదచేయాలని కోరుతూ చేపట్టిన రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి బయలు దేరి ప్రచార జాతా చీరాలకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక ఐఎల్‌టిడి కంపెనీ వద్ద ఐటిసి నాయకులు, కార్మికులు జాతా బృందానికి ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక గడియార స్థంభం సెంటర్ వద్ద నిర్వహించిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 1,2,3 తేదీలలో నెల్లూరులో జరగనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. గత వైసిపి ప్రభుత్వం రాజధాని తరలింపు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అమరావతి రాజధాని పరిరక్షణ కోసం పోరాడుతున్న రైతులు ప్రజలపై కేసులు బనాయించినట్లు తెలిపారు. దీంతో రాజధాని నిర్మాణం నిలిచి పోయినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజధాని ప్రాంత సిపిఎం నాయకులు రవి, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, చీరాల ప్రాంతీయ కార్యదర్శి ఎన్.బాబూరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.కొండయ్య, సిఐటియు కార్యదర్శి ఎం.వసంతరావు, విశ్రాంత ఉద్యోగుల నాయకులు డి.నరపరెడ్డి, ఐటిసి నాయకులు సుధీర్, కాలేషా, శివరాజు, పోతురాజు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి : ప్రభుత్వాలు మారుతున్న పోలవరం నిర్వాసితుల బ్రతుకులు మారడం లేదని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరులో ఈనెల 1,2,3 తేదీల్లో నిర్వహిస్తున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పోలవరం నుంచి ప్రారంభమైన ప్రచార జాతా అద్దంకి చేరింది. ఈ సందర్భంగా సిపిఎం అద్దంకి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అద్దంకిలోని భవానీ సెంటర్‌లో జాతాకు ఘన స్వాగతం పలికారు. అనంతరం భవానీ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ బైక్, ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామారావు పోలవరం ప్రాజెక్టు పరిధిలో నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. 19 సంవత్సరాలుగా పోలవరం గురించి మాట్లాడుతున్న పాలక పార్టీల నాయకులు. ప్రభుత్వ పెద్దలు నిర్వాసితుల సమస్యల గురించి మాట్లాడటం లేదని వాపోయారు. సంవత్సరానికి రెండు మూడు సార్లు వచ్చే వరదలతో అక్కడి ప్రజలు ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని కొండ గుట్టల పైన నివసిస్తున్నట్లు తెలిపారు. గిరిజన జీవితంలో భాగమైన పశువులు, పక్షులు, గుడిసెలు పోలవరం నీటి గర్భంలో మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు మోండ్రు ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ మజుందర్, అద్దంకి పట్టణ కమిటీ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు స్థానిక సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, ఫ్రూట్ వెండర్స్ నాయకులు, మున్సిపల్ వర్కర్లు, సిపిఎం నాయకులు కె.రఘు చంద్ , పి.ఆదాము, రావులపల్లి కోటేశ్వరరావు, గంగాధర్, దశరథ, కెవి. శ్రీను,తోట వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



బాపట్లలో నివాళులర్పిస్తున్న నాయకులు



అద్దంకిలో మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామారావు



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

గుంజి వెంకట్రావుకు ఘన నివాళి

ప్రజాశక్తి- అద్దంకి

తుది శ్వాస వరకూ సిపిఎం జెండాను మోస్తూ ప్రజా సమస్యలపై పోరాడిన గొప్ప వ్యక్తి సిఐటియు నాయకులు గుంజి వెంకట్రావు అని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య తెలిపారు. సిఐటియు నాయకులు వెంకట్రావు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయన మృతదేహంపై నాయకులు శుక్రవారం ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సిఐటియు మండల కార్యదర్శిగా, సిపిఎం మండల నాయకులుగా గుంజి వెంకట్రావు పనిచేసినట్లు తెలిపారు. సిపిఎంలో పనిచేసే వ్యక్తుల చర్యలు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉంటాయని గుంజి వెంకట్రావు ముందుగానే గ్రహించి తాను మరణానంతరం తన మృతదేహాన్ని సమాజానికి ఉప యోగపడేలా హాస్పిటల్‌కు ఇవ్వాలని తమ కుటుంబ సభ్యులకు తెలిపినట్లు ఆయన వివరించారు. కుటుంబ సభ్యుల అంగీకారం గుంజి వెంకట్రావు మతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య, కార్యవర్గ సభ్యులు మజుందర్, జిల్లా నాయకుడు మోండ్రు ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, బి.విజయ్ కుమార్, పట్టణ మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.



తహశీల్దారును సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

తహశీల్దారుకు సన్మానం

ప్రజాశక్తి -భట్టిప్రోలు

భట్టిప్రోలు డిప్యూటీ తహశీల్దారు గాజులవర్తి నాగరాజు కారంచేడు తహశీల్దారుగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు తహశీల్దారు మేక శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది నాగరాజుకు శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్, ఐఆర్ఐ ఫణికుమార్, విఆర్ఓలు శివరామకృష్ణ, కాశీ కృష్ణ ప్రసాద్ , పుల్లయ్య , మంద్రు జకరయ్య , సురేష్ , కిరణ్ పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి- బాపట్ల

బాపట్ల వ్యవసాయ కళాశాల ఎదురుగా ఉన్న టౌన్ హాల్‌లో శుక్రవారం వేగేసిన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాకు సుమారు 2500 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరిలో 350 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి- సంతమాగులూరు

సంతమాగులూరు తహశీల్దారు కె.రవిబాబు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకట మురళి చేతుల మీదుగా ఉత్తమ తహశీల్దారుగా అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. అందులో భాగంగా అవార్డు గ్రహీత రవిబాబును మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు జూపూడి ఆదినారాయణ, డీటీ రాఘవరావు, ఆర్ఐ రామారావు, ఎంపిపి వై. యలమంద, నాయకులు చేవూరి వాసు రెడ్డి, తేలప్రోలు రమేష్, పసుపులేటి కోటేశ్వరరావు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

కృష్ణ మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి దిగ్భ్రాంతి

ప్రజాశక్తి-పర్చూరు

టిడిపి పర్చూరు నగర అధ్యక్షుడు అగ్ని గుండాల వెంకటకృష్ణ మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం బాధాకరమన్నారు. కృష్ణ మరణం టిడిపి తీరని లోటు అన్నారు. పర్చూరు నగరంలో టిడిపి అభివృద్ధికి కృష్ణ విశేష కృషి చేశారన్నారు. తెలుగుదేశం పార్టీ నిబద్ధత కలిగిన నేతను కోల్పోయిందన్నారు. కృష్ణ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



కృష్ణ (ఫైల్)



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

గ్రామాల అభివృద్ధికి కృషి : మంత్రి

ప్రజాశక్తి - మేదరమెట్ల

పట్టణాలకు పోటీగా గ్రామాలనూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయ డానికి ప్రణాళి కలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మేదరమెట్లలో త్వరలోనే సిసి కెమెరాలను ఏర్పాటు చేసి ప్రజల రక్షణ చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. మేదరమెట్లకు చెందిన 374 గిరిజన కుటుంబాలకు భూ హక్కు పట్టాలు శుక్రవారం అందజేశారు. అనంతరం రూ.40 లక్షలతో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. రూ.40 లక్షల నిధులతో రోడ్డ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. మేదరమెట్ల ఎస్టీ కాలనీలో సింథైడ్ ఫ్యాక్టరీ వారు సిఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీ మేరకు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయడంతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైనట్లు ఆయన విమర్శించారు. వరద నీటి ప్రభావానికి గుండ్లకమ్మ గేట్లు కొట్టుకు పోయినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోలేదని తెలిపారు. ఇసుక దోపిడీ చేశారని విమర్శిం చారు. గుండ్లకమ్మ గేట్లకు మరమ్మతులు చేయించి అందులో 6 లక్షల చేప పిల్లలు వదులు తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, విద్యుత్, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి -భట్టిప్రోలు

భట్టిప్రోలు గ్రామంలో అనేక సంవత్స రాలుగా పరిష్కారం కాని విద్యుత్తు సమస్యలకు ప్రజాశక్తి చొరవతో పరిష్కారం లభించింది. భట్టిప్రోలు నుంచి చెరుకుపల్లి వెళ్లే రహదారిలో పోలీస్ స్టేషన్ వద్ద నుంచి అద్దేపల్లి బస్సు షెల్టర్ వరకు విద్యుత్తు స్తంభాలు ఉన్నాయి. ఆ ప్రాంతంలోని గృహాలు, వీధిలైట్లు సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదు. దీంతో భట్టిప్రోలు నుంచి అద్దేపల్లి కి వెళ్లే పాదాచారులు రాత్రి సమయంలో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయం గురించి ప్రజాశక్తి దినపత్రిలో కథనాలు ప్రచురితం అయ్యాయి. దీంతో అధికారులు స్పందించారు. ఈ మార్గంలో విద్యుత్తు వైర్లు ఏర్పాటు చేసి బల్బులు ఏర్పాటుకు నిధులు సమ కూర్చాలని విద్యుత్ శాఖ అధికారులు గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు. దీంతో పంచాయతీ పాలకవర్గం స్పందించి విద్యుత్ వైర్లు, బల్బుల కొనుగోలు కోసం రూ. 83 వేలు విద్యుత్ శాఖకు చెల్లించారు. దీంతో విద్యుత్ సిబ్బంది విద్యుత్ వైర్లను ఏర్పాటు చేశారు.



స్వర్ణలతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

ఉపాధ్యాయురాలు స్వర్ణలతకు సన్మానం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఈదుమూడి హైస్కూల్‌కు చెందిన సైన్స్ ఉపాధ్యాయురాలు జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. దక్షిణ భారతదేశంలో నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలో మనరాష్ట్రం నుండి పాల్గొన్న కాకి స్వర్ణలత ప్రదర్శనకు జాతీయ స్థాయి ప్రత్యేక బహుమతి లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన సన్మానసభలో పాఠశాల స్థలదాత కూనం పూర్ణచంద్రరావు మాట్లాడుతూ స్వర్ణలత గత 8 ఏళ్ల నుంచి ఇదే పాఠశాలలో పనిచేస్తూ సైన్స్‌లో విద్యార్థులు మంచి ప్రావీణ్యత సాధించే విధంగా తీర్చిదిద్దారన్నారు. పాఠశాల అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించి గ్రామానికి పాఠశాలకు మంచిపేరు తీసుకువచ్చారన్నారని కొనియాడారు. అనంతరం స్వర్ణలతను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.శంకరరావు, గ్రామస్తులు కూనం చినవీరయ్య, ప్రేమ్ చంద్, కె.వెంకట్రావు, ఉపాధ్యాయులు కె.శంకర రావు, గాదంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి-కొత్తపట్నం

కరవది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా సేవలందించి పదవీ విరమణ చేస్తున్న కడియాల ప్రసాద్‌ను సన్మానించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సన్మాన సభలో కొత్తపట్నం మండలం ఎస్‌టియు శాఖ తరపున మండల అధ్యక్షులు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కె.ఏసునాథం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అక్షరాల వల్లనే నేను ఇంత గొప్పవాడినయ్యానని అందుకే ఆఅలను ఆరాధిస్తూ విద్యార్థులకు విద్యనందించానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు కె.యర్రయ్య, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఆదినారాయణ, శివశంకర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ ఈడీ తనిఖీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు ప్రక్రియపై బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు పలు సచివాలయాలను తనిఖీ చేశారు. శుక్రవారం ఒంగోలు రూరల్ మండలం ఎర్రజర్ల, టంగుటూరు మండలంలోని కందులూరు సచివాలయాలను తనిఖీ చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీ, ఈబీసీ, కాపు నిరుద్యోగ యువతకు మంజూరైన పథకాలకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ గురించి సిబ్బంది ద్వారా సమాచారం రాబట్టారు. సచివాలయాల పరిధిలో ఆయా సామాజిక వర్గాల నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తు ప్రక్రియను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తేవాలని ఆయన సూచించారు.

మస్తాన్‌కు మాజీ మంత్రి సురేష్ నివాళి

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం తాటాకులపాలెంలో చిన్న కల్లగుంట గ్రామ సర్పంచ్ షేక్ వన్నూరు తండ్రి గారు షేక్ మస్తాన్ దశదిన కార్యక్రమానికి కొండపి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొని మస్తాన్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కొండపి మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చీమకుర్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

చీమకుర్తి నగర పంచాయతీ అభివృద్ధికి రాజకీయాలకతీతంగా సహకారం అందిస్తానని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ సమావేశం హాలులో జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి చైర్మన్ గోపురపు రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికల సమయంలోనే మాట్లాడాలని, ఎన్నికల అనంతరం అభివృద్ధిపైనే దృష్టి పెట్టాలన్నారు. డిఎంఎఫ్ నిధుల నుంచి రూ.5 కోట్ల ఉడా నిధుల నుంచి రూ.ఒక కోటి నిధులు తెప్పించి చీమకుర్తి అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అందరూ కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా 16 అభివృద్ధి పనులను ఆమోదించారు. అనంతరం చైర్మన్ చాంబర్లో కౌన్సిలర్లతో మాట్లాడారు. తమ వార్డుల్లో సమస్యలను, అభివృద్ధి పనులను సూచించాలని, వాటి పరిష్కారానికి తాను ప్రత్యేక దృష్టి పెట్టి పని చేస్తానని పేర్కొన్నారు. ముందుగా ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్‌కు పలువురు కౌన్సిలర్లు, నాయకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోపురపు రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్ బావన వెంకటరెడ్డి, ఎన్.మాణిక్యం, కమిషనర్ రామకృష్ణయ్య, కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, తొప్పెట బాబురావు, సోమ శేషాద్రి, ఆముదాలపల్లి ప్రమీల, పత్తి కోటేశ్వరరావు, భీమన వెంకట్రావు, కోఆప్షన్ సభ్యులు సింగం ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



ఆంధ్ర హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న కళాపరిషత్ నిర్వాహకులు

పివిఆర్ గ్రౌండ్స్‌లో ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందేశాన్ని అందించాయి. ఒంగోలు ఆంధ్ర హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన "ఆధునిక చదువులు–ఆసక్తి లేని చదువులు, విద్యార్థులను బలి తీసుకోవటంతో పాటు కన్నవారి కడుపుకోతకు గురిచేస్తాయని ప్రదర్శించిన స్కిట్ మంచి సందేశాన్ని ఇచ్చింది. అపెక్స్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన "స్వాతంత్రోద్యమం గ్రౌండ్ ప్లే" ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత మణికంఠ నాదస్వర బృందం నాదస్వరం వీనులవిందు చేసింది. ఆలకూరపాడు హై స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన అలరించింది. రాత్రి కర్నూల్ వారి టీజీవి కల్చర్ కల్చరల్ అకాడమీ నేతృత్వంలో వివి రమణారెడ్డి దర్శక సారథ్యంలో ప్రదర్శించిన శ్రీ వెంకటేశ్వర మహత్యం పౌరాణిక రూపకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులను కళాపరిషత్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

5న నిరసన ర్యాలీని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-చీమకుర్తి



మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 5న జరిగే నిరసన ర్యాలీలు, ధర్నాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అన్నారు. శుక్రవారం స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనంలో జరిగిన సిఐటియు మండల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి ఎం.ల క్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కాలం సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు, యజమానులకు అనుకూలంగా కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయాలని చూస్తుందన్నారు. కార్మిక వర్గానికి తీవ్ర నష్టం చేసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, నాయకులు ఈ.నాగయ్య, టి.శ్రీను, కే.శంకర్, కనకరాజు, ను గ్గా శీను, వాలేశ్వరరావు, జి.ప్రభుదాసు, రాఘవ పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి-ముండ్లమూరు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైతులు పంటల సాగు చేసే ముందుగా విత్తన శుద్ధి చేసి నాటుకుంటే తెగుళ్లను నివారించవచ్చని వ్యవసాయ అధికారి ఎండి ఫరూక్ తెలిపారు. మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో శుక్రవారం గ్యాప్ పొలంబడి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఒక కేజీ విత్తనానికి 10 గ్రాములు ట్రైకోడెర్మా విరిడి కలిపి విత్తన శుద్ధి చేస్తే ఎండు తెగులు, కుళ్ళు తెగులు నివారణను సమర్థవంతంగా నిర్మూలించుకోవచ్చు అన్నారు. పంట పొలాలకు పురుగుమందులు, ఎరువులు అధికంగా వాడటం వలన అవి ప్రజలపై, భూమిపై విష ప్రభావం చూపుతుందని, పురుగు మందులు, ఎరువులు లేకుండా వ్యవసాయం సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



పోస్టర్లు అంటిస్తున్న సీపీఎం నాయకులు

మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కొండపి

నెల్లూరులో జరుగుతున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని వాల్‌పోస్టర్లను సిపిఎం నాయకులు కొండపి పట్టణంలో గోడలకు అతికించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే మహాసభలకు ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.రూబెన్, కెజె మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న మండవ మురళీకృష్ణ

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, సవిత దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక డిఆర్ఆర్ఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఒంగోలు టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మేడా శ్రీనివాసరావు మాట్లాడుతూ తరగతి గదుల్లో నేర్పుకున్న పాఠాలను ఏకాగ్రతతో చదవటమే కాకుండా ఆ పాఠాలను తోటి విద్యార్థులతో చర్చించినప్పుడే ఎక్కువ కాలం గుర్తుంటాయన్నారు. పదోతరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు, టీచర్స్ సురేష్, రాజ్యలక్ష్మి, రమణ, చిక్కాల కిరణ్ కుమార్, ఎక్స్ ఆర్మీ ఆఫీసర్ కూనంశెట్టి చక్రవర్తి, సూర్య శ్రీ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అనిల్ రాజును సన్మానిస్తున్న అధ్యాపకులు

ఇమేజ్ ప్రాసెసింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-టంగుటూరు

డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్ అండ్ అప్లికేషన్స్ అనే అంశంపై పేస్ కళాశాలలో గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. పేస్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ టి.అనిల్ రాజు పాల్గొని విద్యార్థులకు ఇమేజ్ ప్రాసెసింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనిల్ రాజుని కళాశాల అధ్యాపకులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ హెల్త్‌కేర్, ఆటోమోటివ్, సెక్యూరిటీ వంటి రంగాలలో ఆటోమేటెడ్ ఇమేజ్ విశ్లేషణకు డిమాండ్ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవికే మూర్తి, డీన్ అకాడమిక్స్ సీవీ సుబ్బారావు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.అప్పారావు, కార్యక్రమ సమన్వయ కర్త కె.లావణ్య, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలుపై దృష్టి పెట్టాలి

సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రాచారి

ప్రజాశక్తి-మద్దిపాడు



వీరభద్రాచారి

పంచాయతీలలో ఇంటిపన్ను వసూలుపై కార్యదర్శులు దృష్టిపెట్టాలని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి సూచించారు. శుక్రవారం మద్దిపాడులో ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు వందశాతం వసూలుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. వచ్చిన నిధులు గ్రామాభివృద్ధికి ఉపయోగపడతాయని తెలిపా రు. వేసవిలో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలన్నారు.



ఆయుర్వేద ఉద్యోగిని సన్మానిస్తున్న డాక్టర్ ఏడుకొండలు

ఆయుర్వేద ఉద్యోగికి సన్మానం

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని డిజిపేట గ్రామంలో ఆయుర్వేద వైద్యశాల అటెండర్‌గా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన మన్నేపల్లి చిన్ని దంపతులను ఘనంగా సన్మానించారు. ఆయుర్వేద వైద్యులు గద్దె ఏడుకొండలు, పుండరి కాంక్షరావు శాలువాతో సన్మానించారు. చిన్ని ఎంతో బాధ్యతగా పని చేసేవారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు ఆల్ల భాస్కరరావు, యుటిఎఫ్ నాయకులు ఎన్ వెంకట్రామయ్య పాల్గొన్నారు.

దర్శి : సూపర్వైజర్‌గా కురిచేడులో పనిచేస్తున్న నాగమణి ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక సిడిపిఓ కార్యాలయంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సిడిపిఓ సిహెచ్ భారతి మాట్లాడుతూ నాగమణి ఎక్కడ అంగన్‌వాడి సూపర్వైజర్‌గా పనిచేసిన ఆమె అందరికీ స్ఫూర్తి వంతంగా పనిచేశారని అన్నారు. బాధ్యతగా ఎప్పుడు నిరంతరాయంగా కష్టపడుతూ ఉండే వ్యక్తిగా గుర్తింపు పొందారని అన్నారు. నాగమణి, వెంకటేశ్వర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు అనురాధ, జ్యోతి, సునీత, సుభాషిని, హేమలత పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - దొనకొండ

మండలంలోని అన్నీ గ్రామాల్లోని బిసీల్లోని అన్నీ కులాలు, కాపు (బలిజ), కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మన్లకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వయం ఉపాధి పథకాల మంజూరుకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఓ శ్రీదేవి కోరారు. అర్హులైన లబ్ధిదారులు ఈనెల 7లోపు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల స్థాయిలో బ్యాంకుల సహకారంతో అర్హత పరిశీలన, ఫీల్డ్ వెరిఫికేషన్ చేపట్టి ఎంపికైన లబ్ధిదారులకు మార్చి నెల 10నుండి 20వరకు రుణమేళ ద్వారా యూనిట్లు ప్రారంభిస్తారని తెలిపారు. అర్హత, ఆశక్తి ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - దొనకొండ



శ్రీరాం చిన్నవెంకటయ్య (52)

అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం లోని సంగాపురం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. మండలంలోని కలివెలపల్లి గ్రామంకు చెందిన శ్రీరాం చిన్నవెంకటయ్య(52) తన ద్విచక్ర వాహనంపై దొనకొండ నుండి గ్రామంకు వెళుతున్నాడు. సంగాపురం గ్రామ సమీపంలో ఏం జరిగిందో రోడ్డు ప్రక్కనే కర్తపు మడుగులో పడి ఉన్నట్లు గ్రామస్తులు అటువైపు వెళ్తూ చూసి బంధువులకు సమాచారం అందించారు. భార్య, బంధువులు హుటాహుటిన సంఘటన ప్రదేశంకు వెళ్లి రక్తపు మడుగులో పడి ఉన్న వెంకటయ్యను ఆటోలో ఎక్కించుకొని దొనకొండలోని వైద్యశాలకు తీసుకురాగా వైద్యుడు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. వెంకటయ్యకు గొంతు క్రింద భలమైన గాయం ఉండటం, మరెక్కడా గాయాలు లేకపోవటంతో బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బంధువుల సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ రంగనాయకులు, పోలీస్ సిబ్బంది సంఘటన జరిగిన ప్రదేశం వద్దకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

వికలాంగులకు పరికరాల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి-దర్శి



మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

కలెక్టర్, జిల్లా వికలాంగ సంక్షేమ శాఖ, టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో వికలాంగులకు అవసరమైన పరికరాల గుర్తింపు శిబిరం శుక్రవారం నిర్వహించారు. పరికరాలు అవసరమైన వారికి పరీక్షించిన తరువాత చేతి కర్ర, వీల్ ఛైర్స్, ట్రై సైకిల్స్, కాలిపర్స్ తదితర పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు తాము ఎంచుకున్న రంగాల్లో విజేతలుగా నిలిచారని అన్నారు. విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన పరికరాల ఎంపిక ప్రక్రియ శిబిరాన్ని ఆమె ప్రారంభిం చారు. నాటి ఐన్‌స్టీన్, న్యూటన్, లూయిస్ బ్రెయిలీ, హెలెన్ కెల్లర్, స్టీఫెన్ హాకింగ్ నుంచి నిక్ ఉయిచిచ్, ఇరా సింఘాల్ వరకూ ఇలా విభిన్న ప్రతిభావంతులైన వారంతా విజేతలుగా నిలిచారని అన్నారు. ఎవరి జీవితాన్ని తీసుకున్నా స్ఫూర్తి ఎగసిపడుతుందని అన్నారు. వారంతా పట్టుదలకు మారుపేరుగా నిలిచారని అన్నారు. కఠోర శ్రమకు, ఆదర్శ జీవితాలకూ వన్నెలద్దిన వారని అన్నారు. సభ్య సమాజం నుంచి ఎన్ని ఈసడింపులు ఎదురైనా ఆత్మవిశ్వాసమే ఊపిరిగా అనితర సాధ్యమైన మార్గంలో పయనిస్తూ నూతన శకానికి నాంది పలికిన వారని అన్నారు. వికలాంగులే అయినప్పటికీ వారు కొత్త ఊపిరిలూదారని అన్నారు. అసలు వైకల్యం అంటేనే పెద్ద సవాలు. దాన్ని ఎదిరించి మొక్కవోని దీక్షతో నేడు ముందుకు సాగుతున్నారని అన్నారు. లక్ష్యం ఎంతటి కష్టమైనదైనప్పటికీ దూసుకెళ్లడానికి సై అంటున్నారని అన్నారు. శ్రమిస్తే అసాధ్యమైనదంటూ ఏదీ లేదని నిరుపిస్తూ 'విభిన్న ప్రతిభావంతులు'గా నిలుస్తున్నారని అన్నారు. పరిపాలనాదక్షత గలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రజల మేలుకు రాజకీయాల్లోకొచ్చిన పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా యువసత్తా నిరూపించారని అన్నారు. మంత్రిగా ప్రజల మన్ననలు అందుకుంటున్న నారా లోకేష్ నాయకత్వంలో ఇలాంటి మంచి కార్యక్రమాలు జరగడం ప్రతీ ఒక్కరూ గమనించాలని అన్నారు. ప్రభుత్వం నెలవారీ పింఛన్‌గా ఒక్కో విభిన్న ప్రతిభావంతునికి రూ.6 వేలు, పూర్తి అంగవైకల్యం కలిగిన వారికి రూ.15వేలు చొప్పున పంపిణీ చేయడం మెచ్చుకోదగిన విషయమని ప్రతీ ఒక్కరూ గుర్తించాలని పేర్కొన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ దర్శిలో గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. విభిన్న ప్రతిభావంతుల, టిజి, వయో వృద్ధులు అధిక సంఖ్యలో హాజరై, వారి అర్హతకు తగిన పరికరాలను నమోదు చేపించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి యువనాయకులు డాక్టర్ కడియాల లలితసాగర్, మాజీ శాసన సభ్యులు నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధికారి ఎడి అర్చన, ఎంపిడిఓ, మున్సిపల్ కమిషనర్ మహేష్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల ప్రసంగం

ప్రజాశక్తి-దర్శి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న అద్యాపకులు ప్రసాద్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ అతిథి అధ్యాపకుల ప్రసంగానికి డాక్టర్ వేటి ప్రసాద్, డాక్టర్ సిహెచ్ ప్రసాద్‌ను శుక్రవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వి రమణ మాట్లాడుతూ అతిథి అధ్యాపకుల ఆహ్వానం కోసం భౌతిక శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగాల విభాగాధిపతుల కృషిని అభినందించారు. అద్దంకిలోని కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో భౌతిక శాస్త్రం లెక్చరర్ డాక్టర్ వేటి ప్రసాద్ బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల కోసం మెకానిక్స్‌పై అతిథి ఉపన్యాసం ఇచ్చారు. కంప్యూటర్ సైన్స్ కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్ డాక్టర్ సిహెచ్ ప్రసాద్ బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల కోసం డేటా రకాలు అనే అంశంపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె నరేష్‌కుమార్, డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ ఫిజిక్స్, భౌతిక శాస్త్రం లెక్చరర్ సిహెచ్ ప్రవీణ, కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ కె రవీంద్ర పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కొనకనమిట్ల



గొర్రెలకు మందును తాపిస్తున్న డాక్టర్ అమూల్య

మండలంలోని గనివెనపాడు గ్రామంలో శుక్రవారం పశువైద్య ఆరోగ్య శిబిరంను ఏర్పాటు చేసినట్లు డాక్టర్ అమూల్య తెలిపారు. ఆయా గ్రామాల్లోని పశువులు, జీవాలకు వైద్య పరీక్ష నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఉన్న జీవాలను పరీక్షించి వ్యాక్సిన్లు వేసి మందులు పంపిణీ చేశారు. సీజన్‌లో వచ్చే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని పశుపోషకులు, పశుకాపర్లకు సూచించారు. కోళ్లల్లో వచ్చే కొక్కెర వ్యాధికి, బొబ్బ వ్యాధికి ఇంజక్షన్లు చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పశువులు, జీవాలకు మందులు తాపించామని తెలిపారు. గేదెలకు కృత్రిమ గర్భధారణ పరీక్షలు నిర్వహించి ఇంజక్షన్ చేసినట్లు తెలిపారు. సీజన్లో వచ్చే వ్యాధుల గురించి వివరించారు. వ్యాధులు సోకిన వెంటనే వైద్యులను సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ అమూల్య, గనివెనపాడు సర్పంచి పాలూరి లక్ష్మీవెంకటేశ్వర్లు, పూర్ణచంద్ర, పిల్లి నాగార్జునరెడ్డి, శ్రీనివాసులు, కె వెంకటేశ్వర్‌రెడ్డి, మహబూబ్ బాష, నాగేంద్రమ్మ, నాగరాజు, శ్రీజ, వెంకటేశ్వర్లు, పారా పెద్దవెంకటేశ్వర్లు, వన్నెబోయిన వెంకటనారాయణ పాల్గొన్నారు.

సిఎస్.పురం : స్థానిక రైతు సేవా కేంద్రం పరిధిలోని ముండ్లపాడు గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. శిభిరంలో 48 గేదెలు, 488 గొర్రెలు, మేకలకు నట్టల వారణ మందు, 4 పశువులో కృత్రిమ గర్భాదారణ చేసినట్లు పశువైద్యులు తెలిపారు. కార్యక్రమంలో నరసయ్య, బోడయ్య, పశువైద్య సహాయకులు శివనారాయణ, వెంకటేశ్వర్లు, హనుమంతు, నవీన్, గౌస్య, నూర్జాహాన్, ఆది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు అభినందన

ప్రజాశక్తి - పొదిలి



అధికారులను అభినందిస్తున్న టిడిపి నాయకులు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎస్పీ ఎఆర్ దామోదర్, కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు అందుకున్న తహశీల్దారు ఎంవి కృష్ణారెడ్డి, సిఐ టి వెంకటేశ్వర్లను తెలుగు నాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవులూరి యలమంద, మూగచింతల మాజీ సర్పంచ్ గోరంట్ల రమణయ్య, కట్ట బ్రహ్మారెడ్డి, మాజీ వార్డు సభ్యులు రోళ్ల శీను పాల్గొన్నారు.



ఉపాధ్యాయున్ని సన్మానిస్తున్న ఎంఇఓ సుబ్బారావు

ఉపాధ్యాయులే ఉత్తమ పౌరుల నిర్మాతలు

ప్రజాశక్తి - కురిచేడు

మండలంలోని పడమర వీరాయపాలెంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తుమ్మల సూర్యనారాయణ పదవీ విరమణ సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పచ్చా పూర్ణ చంద్రరావు అధ్యక్షత వహించారు. సభలో ఎంఇఓ సిహెచ్ సుబ్బారావు మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. నేటి సమాజంలో రుగ్మతలకు వ్యతిరేకంగా విద్యార్థులను సరియైన పద్ధతిలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ప్రధాన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. తుమ్మల సూర్యనారాయణ తన సర్వీసు అంతా విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దారని అన్నారు. ఉపాధ్యాయులు షేక్ ఖాదర్ వలీ, ఖాజా రహంతుల్లా, సిహెచ్ శివరామకృష్ణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు వి రమణారావు, ఎస్‌విఎల్ సుబ్బారావు, అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

ప్రజాశక్తి - దర్శి

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు వెంటనే భర్తీ చేసే విధంగా మెగా డీఎస్సీ ప్రకటించాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్ కరుణానిధి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల గోడ పత్రికను శుక్రవారం స్థానిక గుజ్జుల సరళా దేవి భవన్‌లో ఆవిష్కరించారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత అభివృద్ధికి దొనకొండలో పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నిరుద్యోగ భృతి ఇస్తామన్న ఎన్నికల వాగ్దానం అమలు చేయాలని అన్నారు. ఫిబ్రవరి 6 నుండి 9వరకు శ్రీకాకుళంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సన్నెబోయిన రామంజి యాదవ్, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీను, అభిషేక్, వీరయ్య చౌదరి, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమపద్ధతిలో చదవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - రేపల్లె

అధ్యయనం-పోరాటం నినాదాలతో పనిచేసే ఎస్ఎఫ్ఐ విద్యార్థులు బాగాచదవాలని- మంచి ఫలితాలు సాధించాలని కోరుతూ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజి,చైతన్య,నారాయణ, విశ్వ, హంస కళాశాలలో మరియు ఎస్సి,ఎస్టి గురుకుల పాఠశాలలు,సాంఘిక సంక్షేమ హాస్టల్లోని ఇంటర్,10 వ తరగతి విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఎం.సూర్య ప్రకాష్, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు వై.నవీన్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అధ్యయనం, పోరాటం అనే నినాదంతో విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోరాటాలకు పరిమితం కాకుండా విద్యార్థులను చదువులోనూ ప్రోత్సహిస్తూ బహుముఖ, సాంస్కృతిక కార్యక్రమాల్లో పోటీలు, సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్,10 తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని కోరుతూ కరపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను తరగతి గదుల్లో మోటివేషన్ చేస్తూ నిరంతరం ఎస్ఎఫ్ఐ అన్ని సందర్భాల్లో విద్యార్థులకి అండ,దండలుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మార్టూరు

రజక వత్తిదారుల సంఘం జిల్లా క్యాలెండర్ ఆ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ శింగయ్య అధ్యక్షతన శుక్రవారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.కొండయ్య, డాక్టర్ పాపారావు, ఎం. పర్వతాలు, సిఐటియు నాయకులు హనుమంతరావు, రజక వృత్తిదారుల సంఘం నాయకులు ద్రోణాదుల వెంకట రావు, ద్రోణాదుల శీను సాంబయ్య, గోపిపాల్గొన్నారు.

వాటర్ బాటిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - పంగులూరు.

మండల పరిధిలోని నూజిల్లపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు శుక్రవారం వాటర్ బాటిళ్లు అందజేశారు. నూజిల్లపల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు మద్దినేని ఈశ్వరయ్య, అంజమ్మ జ్ఞాపకార్థం ఆర్‌టిసి డ్రైవర్ మద్దినేని వెంకటేశ్వర్లు విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతకు పాఠశాల ప్రధానో పాధ్యాయుడు కేమ వీరాంజనేయులు, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

భూముల రీసర్వే పరిశీలన

ప్రజాశక్తి -చిన్నగంజాం

భూముల రీ సర్వే సక్రమంగా నిర్వహించాలని చీరాల ఆర్‌డిఒ చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. మండల పరిధిలోని మోటుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను శుక్రవారం ఆర్‌డిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ రైతులు సర్వేకు హాజరయ్యేలా నోటీసులు జారీ చేయాలన్నారు. తప్పులు లేకుండా సర్వేనిర్వహించాలని అధికారులు సూచించారు. అనంతరం సర్వే టీమ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వాన్ పిక్ , పారెస్ట్, దేవాదాయ శాఖల అధికారులకు సమాచారం అందించి నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె.ప్రభాకరరావు, సర్వే ఇన్‌స్పెక్టర్ మునలయ్య, రీ సర్వే డిటి కె. సుజాత,గ్రామ సర్వేయరు పాల్గొన్నారు.

పంగులూరు.: మండల పరిధిలోని బైటమంజులూరులో నిర్వహిస్తున్న భూముల రీసర్వే ను చీరాల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.సుబ్బారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్బారావు రీసర్వే సమయంలో తీసుకోవాల్సిన చర్యలను గురించి సిబ్బందికి వివరించారు. పలు సూచనలు సలహాలు చేశారు. సర్వే సమయంలో ఆ ప్రాంతంలోని రైతులకు సమాచారం అందించాలి. రైతుల సమక్షంలో రీ సర్వే చేయాలని కోరారు. ఎలాంటి విభేదాలు లేకుండా, వివాదాలు రాకుండా, నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలన్నారు. పంగులూరు తహశీల్దార్ పి .సింగారావు మాట్లాడుతూ సిబ్బంది ఎలాంటి అలసత్వం లేకుండా రీసర్వే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ

మున్సిపల్ చైర్మన్‌కు డిసెంట్ అందజేత

ప్రజాశక్తి - చీరాల

చీరాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 31వ వార్డు కౌన్సిలర్ సత్యనందంకు ముందుస్తూ నోటీసు జారీ చేయకుండా మూడు నెలలు సస్పెండ్ చేస్తూ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కౌన్సిల్ సభ్యులు చైర్మన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.గత కౌన్సిల్‌లో చైర్‌పర్సన్ సీటును అగౌరవపరిచారన్న నేపథ్యంలో 31వ వార్డు కౌన్సిలర్ సల్లూరి సత్యానందంను ఏకపక్షంగా 3నెలల పాటు సస్పెండ్ చేస్తున్నానని మరియు సమావేశంలో ఉన్నా అంశములన్నీ వాయిదా వేస్తూ చైర్మన్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తు అయనకు డిసెంట్‌ను కౌన్సిలర్లు అందజేశారు. సమావేశం మధ్యలో హాజరైన ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య సభను భేదాభిప్రాయాలు లేకుండా సామరస్యంగా జరపాలని కోరారు. అయినప్పటికీ చైర్మన్ కౌన్సిలర్లు తనకు క్షమాపణ చెప్పాలని కోరారు. దీంతో కౌన్సిలర్ సత్యానందం గతంలో చైర్మన్ సీటును ఉద్దేశించి మాట్లాడిన వ్యాఖ్యలను తాను వెనుక్కు తీసు



మున్సిపల్ చైర్మన్‌కు డిసెంట్ అందజేస్తున్న కౌన్సిలర్లు

కుంటున్నానని చెప్పారు.అయినప్పటికీ చైర్మన్, వైసిపి కౌన్సిలర్లు సభను వాయిదా వేస్తున్నట్లు చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయారు. కౌన్సిల్ సభ్యుల ఆమోదం, తీర్మానం లేకుండా సత్యానందాన్ని సస్పెండ్ చేయటాన్ని మరియు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నిర్ణయం తీసుకోవాల్సిన అంశాలను వాయిదా వేయడాన్ని వ్యతిరేకిస్తూ కౌన్సిలర్లు చైర్మన్ జంజనం శ్రీనివాసరావుకు డిసెంట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సూరగాని లక్ష్మి, ఉల్లిపాయల సుబ్బయ్య, మించాల సాంబశివరావు,సల్లూరి సత్యానందం,మల్లెల లలిత తదితరులు ఉన్నారు.

అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించం : జేసీ

ప్రజాశక్తి వేటపాలెం

విధుల నిర్వహణలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. మండల పరిధిలోని దేశాయిపేటలో ఉన్న చీరాల ఎంఎల్ ఎస్ పాయింట్‌ను జేసీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ చీరాల ప్రాంతంలో జరుగుతున్న అక్రమ బియ్యం రవాణా గురించి పలు కథనాలు వివిధ దినపత్రికలలో ప్రచురితం అవుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యత వహించినా సహించేది లేదన్నారు. తొలుత గోడౌన్‌లోని కందిపప్పు, బియ్యం బస్తాలను పరిశీలించారు ఆన్‌లైన్‌లో ఉన్న స్టాకును సరిచూశారు. సరుకు ఎక్కడి నుంచి వస్తుంది ఎంత వస్తుంది వాటిని ఏ విధంగా భద్రపరుస్తున్నారు.రిజిస్టర్‌లో ఎలా నమోదు చేస్తున్నారనే అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఒ విలియమ్స్, చీరాల తహశీల్దారు గోపికృష్ణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి గీతారాణి , డిటి శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు, గోడౌన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనగాని ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -రేపల్లె

శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.అనంతరం అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు శివప్రసాద్, టిడిపి మహిళా విభాగం అధ్యక్షురాలు గౌరీ రామకుమారి, మున్సిపల్ వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీ విశ్వనాథ గుప్తా, పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పర్చూరు : వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కూటమి



పూజలు నిర్వహిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

నాయకులు పట్టు వస్త్రాలు అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు మామిడిపాక హరిప్రసాదరావు, కొల్ల బుల్లిబాబు. అడపాల కృష్ణ, ఊటుకూరు నిర్మల, కొత్తూరు సునీత, కోటగుడి ప్రసాదు, యద్దనపూడి హరిప్రసాద్, తులసి రాజేష్, పి. హరి హనుమంతరావు, మురళి, వెంకట రంగ, పాలపర్తి గోపికృష్ణ,. ఎస్‌కె గౌస్, కె.బుజ్జి సురేష్. వినయ్ పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి - నిజాంపట్నం : . మండల పరిధిలోని అడవులదీవి గ్రామంలో పశుసంవర్ధక శాఖ, శ్రీ సత్య సాయి సేవా సమితి వారి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని పశు సంవర్ధక శాఖ రేపల్లె ఏడీ బి.నాంచారయ్యప్రారంభించారు. విశ్రాంత ఏడీ పున్నయ్య శాస్త్రి ఆధ్వర్యంలో ఉచితంగా మందులను అందజేశారు. శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో రైతులకు జామ, నిమ్మ మొక్కలను అందజేశారు ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు శ్రీనివాసరావు, గోవర్ధన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-అమృతలూరు : మండల పరిధిలోని ఇంటూరు గ్రామానికి చెందిన గుమ్మడి శ్యాంసన్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 1,00,391 మంజూరయ్యాయి. అందులో భాగంగా శ్యాంసన్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే నక్కాఆనందబాబు చేతుల మీదుగా శుక్రవారం చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సంతమాగులూరు : రేషన్ డీలర్స్ అసోసియేషన్ మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జూపూడి ఆదినారాయణ, ఉపాధ్యక్షుడిగా అనంతవరపు శ్యాంబాబు, సెక్రటరీగా చింతా గోవిందరావు ఎన్నికయ్యారు. కమిటీ మెంబర్లుగా షేక్ మబల, గంగినేని వెంకటరమణ, బొల్లినేని వేణు, షేక్ సుభాని రావులపల్లి కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమటీని తహశీల్దారు రవిబాబు, పలువురు ప్రజా ప్రతినిధులు చేవూరి వాసు రెడ్డి, తెల్లప్రోలు రమేష్ అభినందనలు తెలిపారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - చీరాల : మాజీ ఎంపిపి నాదెండ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మండల పరిధిలోని తోటవారిపాలెం గ్రామానికి చెందిన 400 కుటుంబాలు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సమక్షంలో శుక్రవారం టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే కొండయ్య వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు సిద్ది బుచ్చియ్య పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- కొల్లూరు : కొల్లూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత ప్రధానోపాధ్యాయురాలు కోయ లమాడి నాగ పాప , బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషా కుమారి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వారి వీడ్కోలు సభ నిర్వహించి సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ కొమ్ము తులామన్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - రేపల్లె : మౌంట్ ఫోర్ట్ సంస్థ వ్యవస్థాపకుడు సెయింట్ లూయిస్ డిపాండ్ ఫోర్ట్ మౌంట్ ఫోర్ట్ జన్మదినం సందర్భంగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరం శుక్రవార నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ప్రారంభించారు. మెడికల్ క్యాంపులో 70 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఎంతగానో ఆకర్షించింది. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటకాలు, తినుబండారాలు తయారు చేసి విక్రయించారు. తద్వారా వచ్చిన నగదులో వికలాంగులకు బియ్యం, నిత్యావసర సామగ్రి అందజేశారు. మెడికల్ క్యాంపుకు సహకరించిన విజయవాడ, మణిపాల్ హాస్పిటల్ సిబ్బందిని, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రెడ్ క్రాస్ సొసైటీ నిర్వాహకులు డాక్టర్ వసంతం వీర రాఘవయ్య, రేపల్లెలోని ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్ సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కిరణ కుమార్, వైస్‌ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి వనరులను

సమర్ధవంతంగా వినియోగించండి

మంత్రి స్వామి



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

జిల్లాలో ఉన్న నీటి వనరులను సమర్ధ వంతంగా వినియోగించుకోవటంపై దష్టి సారించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో శుక్రవారం నాయుడుపాలెంలోని తన నివాసంలో మంత్రి చర్చించారు. సంగమేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతి, ఆ ప్రాజెక్టును పూర్తి చేయటానికి అవసరమైన బడ్జెట్‌పై అధికారులతో మాట్లాడారు. ముసి, పాలేరు నదిలో నీళ్ల వథాగా సముద్రం పాలు కాకుండా అవసరమైన చోట చెక్ డ్యాములు నిర్మించే విషయాన్ని కూడా పరిశీలించాలన్నారు. ఒంగోలు బ్రాంచ్ కెనాల్ 14వ మైలు వద్ద ఎస్కేప్ షట్టర్ మరమ్మతు పనుల పైనా మంత్రి ఆరా తీశారు. తక్షణమే చేపట్టాల్సిన పనులు, దీర్ఘకాలిక అవసరాలను దష్టిలో పెట్టుకుని బడ్జెట్ అంచనాలపై అధికారులతో మంత్రి చర్చించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదం

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదపడతాయని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ శుక్రవారం స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో జెండా ఎగురవేసి ప్రారంభించారు. బాపట్ల, చీరాల, రేపల్లె సబ్‌డివిజన్స్, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు అధికారులు సిబ్బంది మార్చ్ ఫాస్ట్ నిర్వహించి అడిషనల్ ఎస్పీకి గౌరవవందనం సమర్పించారు. అనంతరం క్రీడాకారులతో స్పోర్ట్స్ మీట్ ప్రతిజ్ఞ చేయించి శాంతికి చిహ్నమైన తెలుపు కపోతాలు ఎగురవేశారు. క్రీడా పోటీలు ప్రారంభానికి సూచికగా బెలూన్‌లను ఎగురవేశారు. అడిషనల్ ఎస్పీ జెండా ఊపి పురుషుల 100 మీటర్ల పరుగు పందేన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయిలో జరిగే స్పోర్ట్స్ మీట్‌కు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చీరాల, బాపట్ల, సీసీఎస్ డిఎస్పీలు మొయిన్, రామాంజనేయులు, శ్రీనివాసరావు, జగదీష్ నాయక్, ఏ.ఆర్ డిఎస్పీ పి.విజయసారథి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు

ఉజ్వల భవిష్యత్ అందరి బాధ్యత

- బాల్య వివాహాల నివారణకు కృషి
- 'బంగారు బాల్యం' అమలుకు చర్యలు
- డివిజనల్ స్థాయి అవగాహనలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బాల్యవివాహాలు చేయకుండా బాలికలకు పదిలమైన భవిష్యత్ కల్పించాల్సిన బాధ్యత సమాజంలోని అందరిపై ఉందని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా తెలిపారు. ఈ దిశగానే జిల్లాలో 'బంగారు బాల్యం' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. బాలల హక్కుల చట్టాలపై శుక్రవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో ఎంపిడిఒలు, ఎంఇఒలు, సిడిపిఒలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లలకు నిర్వహించిన డివిజన్ స్థాయి అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాలల సమగ్ర ఎదుగుదలకు, ముఖ్యంగా బాల్య వివాహాలను నివారించి సాధికారత దిశగా బాలికలు ఎదిగేలా 'బంగారు బాల్యం' కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. బాల్య వివాహాలు, పోషకాహార లోపం స్థాయి నుంచి బాలల బంగారు భవిష్యత్తుకు ప్రథమ స్థానంలో ప్రకాశం జిల్లా ఉండేలా మార్పు తీసుకురావాల్సిన ఆవశ్యకతను ఆమె వివరించారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలు, సంబంధిత అంశాలపై చర్చించేలా స్కూల్స్‌లో పిల్లలతో 'బాల పంచాయితీలు' నిర్వహిస్తామన్నారు. విజన్-2047 లో భాగంగా ప్రకాశం జిల్లా కూడా సమగ్రంగా అభివద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. పారిశ్రామికీకరణంలో భాగంగా జిల్లాలో లభించే ఉపాధి అవకాశాలను సమర్థంగా అందిపుచ్చుకునే స్థాయికి మానవ వనరులను, బాలికలను కూడా సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మహిళా పోలీసు తన పరిధిలో ఉన్న బాలికల వివరాలతో ప్రత్యేక రిజిస్టరు నిర్వహించాలని ఆదేశించారు. సమాజంలో బాల్య వివాహాలు జరుగకుండా తమ వంతు బాధ్యత నిర్వహిస్తామని కార్యక్రమంలో పాల్గొన్న వారితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ హేనా సుజన్, డిసిపిఒ దినేష్ కుమార్, ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మి ప్రసన్న, డిఎల్‌డిఒ మహాలక్ష్మీ, డిఆర్‌డిఏ పీడీ రవికుమార్, జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సునీల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో

జిల్లాకు రూ.10 వేల కోట్లు కేటాయించాలి

సిపిఎం వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి, పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణానికి రూ.10 వేల కోట్లు నిధులు కేటాయించాలని సిపిఎం డిమాండ్ చేసింది. శుక్రవారం నాడు ఆ పార్టీ జిల్లా సెక్రటేరియట్ బందం కేంద్రమంత్రి నిర్మలా సీతారామ్‌కు డిమాండ్లతో రాసిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ తమీమ్‌అన్సారియాకు అందించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్‌ను కలిశారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చడమే కాక, జిల్లా అభివద్ధికి రూ.10 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. నెల్లూరు జిల్లాలోని కొంత భాగాన్ని, గుంటూరు, కర్నూలు జిల్లాలలోని కొంత భాగాలను కలిపి 1970లో ప్రకాశం జిల్లా ఏర్పడిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇటీవల పునర్విభజనతో 38 మండలాలతో ప్రకాశం జిల్లాగా ఏర్పడిన జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివద్ధి చేస్తారని జిల్లా ప్రజలు ఆశించారని, కానీ 54 ఏళ్లు గడిచినా కరువుకాటకాలతో జిల్లా వెనుకబడి వుందని, ఫ్లోరిన్ నీటితో గొంతు తడుపుకునే స్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. జిల్లాలో దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్జ్, సి.యస్.పురంలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఫుడ్, ఆక్వా, వెజిటబుల్ ప్రాసెస్ యూనిట్లు, లెదర్ ప్రాసెస్ యూనిట్లను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని, కొత్తపట్నం హార్బర్‌ను నిర్మించాలి, రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా శింగరాయకొండ మండలంలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరారు. ఒంగోలు డెయిరీని అమూల్ సంస్థకు అప్పగించకుండా యన్.డి.డి.బి ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలని, యర్రజర్ల ఇనుప ఖనిజ భూములను విశాఖ ఉక్కు ప్యాక్టరీకి కేటాయించాలని విన్నవించారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులు పూర్తిచేసి దొనకొండ- ఒంగోలు, గిద్దలూరు, బాక్రారావు పేట రైల్వేలైన్ పనులు ప్రారంభించాలని కోరారు. సింగరాయకొండ కనిగిరి, మార్కాపురం, శ్రీశైలం కొత్తలైను మంజూరు చేయాలని, జిల్లాలో కోస్టల్ కారిడార్ ఏర్పాటుకు తోడ్పడాలని డిమాండ్ చేశారు. ఐదు నియోజకవర్గాల ప్రజలకు సాగు, తాగు నీరు అందించే వెలుగొండ ప్రాజెక్టు పనులను సత్వరమే పూర్తిచేసి 2025 వరద సీజన్ నాటికి నీరు అందించాలని, నిర్వాసితులకు పునరావాస ప్యాకేజి చెల్లించాలని, పి.సి.పల్లి, మర్రిపూడి మండలాలను ప్రాజెక్టుపరిధిలో చేర్చాలని కోరారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు రిపేరును పూర్తిచేయాలన్నారు. నిలిచిపోయిన సంగమేశ్వరం రిజర్వాయర్ పనులు ప్రారంభించాలన్నారు. మార్కాపురం మెడికల్ కాలేజిని ప్రభుత్వ రంగంలోనే వుంచాలన్నారు. నిలిచిపోయిన నిర్మాణ పనులు వేగవంతం చేసి.. 2025-26 విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించాలన్నారు. ఒంగోలులో ఇ.ఎస్.ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలి. ఒంగోలు, మార్కాపురం, కనిగిరిలో వున్న డయాలసిస్ సెంటర్లలో ప్రత్యేక వైద్యుడ్ని నియమించి డయాలసిస్ యూనిట్లు పెంచాలని డిమాండ్ చేశారు.

క్షతగాత్రులను హాస్పిటల్‌లో చేర్చాలి

మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు



జిజిహెచ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రవాణా అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రహదారి ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రులను ఎలాంటి భయం లేకుండా ఆసుపత్రులలో చేర్చాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రామచంద్రరావు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం గుడ్ సమ్మారిటన్ కార్యక్రమం ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సంఘమిత్ర హాస్పిటల్, కిమ్స్ హాస్పిటల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పిటల్స్ డాక్టర్స్, నర్సులు, సిబ్బంది, రోగులు, వివిధ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవిఐ కె. రామచంద్రరావు మాట్లాడుతూ రహదారి ప్రమాదంలో క్షతగాత్రులైన వారిని సమీప హాస్పిటల్‌కు తీసుకెళ్ళే వారిని గుడ్ సమ్మారిటన్‌గా పిలుస్తారన్నారు. వారికి కేసులు, మరలా విచారణకు పిలవడం ఉండదని వారికి కేంద్ర ప్రభుత్వం రూ.5 వేలు బహుమతి అందిస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాలలో క్షతగాత్రులైన వారిని ఎటువంటి భయం లేకుండా హాస్పిటల్స్ చేర్చవచ్చని సూచించారు. అనంతరం ఆయా హాస్పిటల్స్‌లో రహదారి మాసోత్సవ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, అవగాహన కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మోటార్ వాహనం తనిఖీ అధికారులు ఏ కిరణ్ ప్రభాకర్, ఎల్. సురేంద్ర ప్రసాద్, సహాయ వాహన తనిఖీ అధికారులు యు. ధర్మేంద్ర, బి. భాను ప్రకాష్, పరిపాలనాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులను ఇబ్బందులు పెట్టొద్దు

- ఉద్యోగులపై పనిభారం తగ్గించాలి
- 4, 5 తేదీల్లో రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు
- ప్రెస్‌మీట్‌లో ఎపిఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు



మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గత వైసిపి ప్రభుత్వంలా రెవెన్యూ ఉద్యోగులను ఇబ్బంది పెట్టొద్దని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగులు ఎంతో కష్టపడి పని చేశారని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఒంగోలుకు వచ్చిన ఆయన స్థానిక ఏపిఆర్ఎస్ఏ భవన్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. జీతభత్యాలు చెల్లించకుండా గత ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగులను ఇబ్బంది పెట్టిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం రెవెన్యూ ఉద్యోగులు పని చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వం ఇప్పటి వరకు ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ మాదిరిగానే నేటి ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగులపై అధిక పనిభారం మోపటంతో పాటు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఎద్దేవా చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ 25 వేల కోట్లు బకాయిలను చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 4, 5 తేదీల్లో రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశాలు అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలియజేశారు. సమావేశంలో ఎపిఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు పిన్నిక మధుసూదన రావు, ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు, కోశాధికారి ఊతకోలు శ్రీనివాసరావు, అసోసియేషన్ ప్రెసిడెంట్ కిరణ్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బొప్పరాజు వెంకటేశ్వర్లు

కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియాను ఎపిఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు, ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఇటీవల కొత్తగా ఎన్నికైన జిల్లా అసోసియేషన్ కార్యవర్గ సభ్యులను కలెక్టర్‌కు పరిచయం చేశారు. తదుపరి పలు రెవెన్యూ సమస్యలపై చర్చించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.